ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



తమిళనాడు
TAMILNADU

ఆదివారం 18 మే 2025

పార్థసారథి ఆలయంలో శనివారాల్లో అన్నదానం

● ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి



అన్నదానం ప్రారంభించి, భక్తులతో కలిసి భోజనం చేస్తున్న ఉదయనిధి

స్థానిక ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయంలో శనివారాల్లో రోజంతా అన్నదాన కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి భోజనం చేశారు. రాష్ట్రంలోని ఆలయాల్లో అన్నదానం పథకం అమలులో ఉంది. ఆ ప్రకారం, ఒక్క పూట అన్నదానం, రోజంతా అన్నదానం, ఉత్సవాలు, ప్రత్యేక రోజుల్లో అన్నదానం అందజేస్తున్నారు. ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యతలు చేపట్టిన అనంతరం 11 ఆలయాల్లో రోజంతా అన్నదానం ప్రారంభించి ప్రస్తుతం 13 ఆలయాలకు విస్తరించారు. అలాగే, ఒక్క పూట అన్నదానం 764 ఆలయాలకు విస్తరించారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో, ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయంలో శనివారం పూర్తిగా అన్నదానం జరుగుతుందని సీఎం ప్రకటించారు. ఆ ప్రకారం, శనివారం పార్థసారథి ఆలయంలో శనివారం అన్నదానం పథకాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, స్టాండింగ్ కమిటీ అధ్యక్షులు సిట్రరసు, మండల కమిటీ అధ్యక్షులు మదన్‌మోహన్ సహా పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

- పెరంబూర్, ఆంధ్రజ్యోతి

24న ఢిల్లీ వెళ్లనున్న స్టాలిన్



రాష్ట్రముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 24న ఢిల్లీ బయలుదేరి వెళుతున్నారు. ఢిల్లీల్లో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగే నీతి ఆయోగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. 2015లో కేంద్ర ప్రణాళికా సంఘానికి బదులుగా నీతి ఆయోగ్ కమిటీ ఏర్పాటైంది. ప్రధాని నరేంద్రమోదీ ఈ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇప్పటి వరకూ 9 సార్లు ఈ కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ కమిటీ పదో సమావేశం ఈ నెల 24న ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగనుది. ఈ సమావేశంలో పాల్గొనాలని దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర ప్రభుత్వం ఇదివరకే ఆహ్వానించింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు స్టాలిన్ వెళ్తున్నారు. గత ఏడాది జూలై 27న జరిగిన నీతి ఆయోగ్ 9వ సమావేశాన్ని స్టాలిన్ బహిష్కరించారు. ఈ పరిస్థితులలో ఈ నెల 24న జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో స్టాలిన్ పాల్గొననున్నారు. ఆ సందర్భంగా రాష్ట్రానికి విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచిన నిధులను విడుదల చేయాలని స్టాలిన్ ఈ సమావేశంలో డిమాండ్ చేయనున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

నేడు 'ఆస్కా' ఎన్నికలు

● బరిలో 'మెంబర్స్ వాయిస్', 'ట్రెండ్ సెట్టర్స్' ప్యానళ్లు
● మరోవైపు ఎన్నిక రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు ● సంశయాలతోనే ఎన్నికకు సభ్యులు



ఆస్కా ప్రాంగణం ముందు ఏర్పాటైన బ్యానర్లు

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లో విజయరాఘవరోడ్డులో వున్న 'ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్' (ఆస్కా)కు ఆదివారం ఎన్నికలు జరుగనున్నాయి. 2600 మంది సభ్యులున్న ఈ క్లబ్‌కు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 8.30 గంటల వరకు ఓటింగ్ జరుగనుండగా, రాత్రి 9.30 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. 'మెంబర్స్ వాయిస్', 'ట్రెండ్ సెట్టర్స్' ప్యానళ్లు బరిలో నిలవగా, వివిధ పదవులకు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీ చేస్తున్నారు. ఎన్నికకు ఇప్పటికే నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, దేశంలోని వివిధ ప్రాంతాల్లో వున్న ఆస్కా సభ్యులు సైతం ఎన్నికల్లో ఓటేందుకు ఇప్పటికే చెన్నై చేరుకున్నారు.

మెంబర్స్ వాయిస్ ప్యానల్..

అధ్యక్షుడిగా జి.శశిధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై.రాజేశ్వరరావు, కార్యదర్శిగా వల్లమూడి దిలీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా మాదాల వెంకటసుబ్బారావు, కోశాధికారిగా ఎల్.శాంత కుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎం.భానుచందర్, కమిటీ సభ్యులుగా మన్నూరు చలపతి, డి.రవిచందర్, మదన గోపాలరావు, పి.ప్రేమ్‌కుమార్, రమేష్‌రెడ్డి, దుర్గాప్రసాద్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, టి.రాజేష్, ఎస్‌పి.శ్రీనివాస్, ట్రస్టీలుగా ముంద్రు శ్రీనివాసరావు, కోటారెడ్డి వేమిరెడ్డి, వి.విజయేందర్‌రావు, పి.సంతోష్‌కుమార్, టీవీఎస్ కోటేశ్వరరావు, పి.మోహన్‌రెడ్డి, ఎన్ఎన్ భిక్షం, వి.బాలాజీ, వి.ప్రశాంత్ పోటీ చేస్తున్నారు.

ఎవరు గెలిచినా 'ముళ్ల కిరీటమే'

ఆస్కా క్లబ్ ఎన్నికల్లో విజయం ముళ్ల కిరీటమేనని సీనియర్లు చెబుతున్నారు. గతంలో అధ్యక్షులుగా వ్యవహరించిన డాక్టర్ సుబ్బారెడ్డి, ఆదిశేషయ్య, నరసారెడ్డి నేతృత్వంలోని కమిటీల నిర్వహణలో ఆస్కా ఒక వెలుగు వెలిగిందని చెప్పకతప్పదు. సభ్యులకు సేవలందించడంతో పాటు తెలుగుభాష, తెలుగు సంప్రదాయాలకు వన్నె తెచ్చేలా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిర్వహించింది. కానీ గత కొన్నేళ్లుగా పూర్తిస్థాయి కమిటీ లేకపోవడం, కేవలం ఆపద్ధర్మ కమిటీయే నిర్వహణ చేపడుతుండడం, సభ్యుల మధ్య వివాదాలు, న్యాయపరమైన నిబంధనల కారణంగా ఆంధ్రా క్లబ్ అస్తవ్యస్థంగా తయారైంది. దీనిని సరిదిద్దడమంటే అది ముళ్లబాటలాంటిదే. అందువల్ల ఈ ఎన్నికల్లో విజయం ముళ్లకిరీటంతో సమానమని సీనియర్లు చెబుతున్నారు. ఒకే ప్యానల్ నుంచి అందరూ ఎన్నికైతే నిర్వహణ సులభమే. కానీ గతంలో మాదిరిగా వివిధ ప్యానళ్ల నుంచి గెలిస్తే మాత్రం మళ్లీ కమిటీలో వివాదాలు, ఆస్కా నిర్వహణ గందరగోళంగా మారడం ఖాయం. మాజీ అధ్యక్షులు ఎం.ఆదిశేషయ్య, మాజీ కార్యదర్శి ఆర్.సాంబశివరావు అండతో ఆస్కా అభివృద్ధికి కృషి చేస్తామంటూ శశిధర్‌రెడ్డి బృందం హామీ ఇస్తుండగా, గతంలో ఎన్నికలకు అవాంతరాలు కల్పించి, చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన వీరేం అభివృద్ధి చేస్తారంటూ ఆస్కా మాజీ అధ్యక్షులు కె.నరసారెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు జి.వేణుగోపాల్ అండతో ఎన్నికలకు దిగిన ప్రతాప్ రెడ్డి బృందం ప్రశ్నిస్తోంది.

ఆస్కా ఎన్నికలకు ఎందుకింత ప్రాధాన్యం?

నిత్యం వెండితెర వెలుగుజిలుగుల మధ్య తళుక్కుంటూ తీవ్ర ఒత్తిడితో ఉండే సినీతారలు కూసింత సేదతీరేందుకు 1952లో ఏర్పాటు చేసుకున్న 'ఆంధ్రా క్లబ్' .. ఆ తరువాత పలు దశలుగా రూపాంతరం చెందడంతో పాటు వివిధ రంగాల ప్రముఖులకు సభ్యత్వం ఇచ్చింది. అయితే సభ్యుల వారసత్వ కోటా వ్యవహారం వివాదాస్పదం కావడంతో ఈ వివాదం కాస్త హైకోర్టుకు చేరింది. చిల్డ్రన్స్ కోటా కింద ఆస్కా సభ్యత్వం పొందిన 89 మందిలో న్యాయస్థానం సూచనల మేరకు 33మందిని మాత్రం వివిధ నిబంధనల మేరకు కొంత రుసుము వసూలు చేసి కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. అయితే దానిని కూడా సవాల్ చేస్తూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిజానికి 2019లో సుప్రీంకోర్టు సూచనల మేరకు మాజీ న్యాయమూర్తి పర్యవేక్షణలో ఆస్కా ఎన్నికలు జరిగాయి. అయితే ఆ ఎన్నికల్లో చిల్డ్రన్స్ కోటా కింద సభ్యత్వం పొందిన వారి కోసం ప్రత్యేక బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేశారు. ఆ తరువాత చిల్డ్రన్స్ కోటా సభ్యులు అభ్యంతరం పెడుతున్నారంటూ బ్యాలెట్ బాక్సులను మూలనపడేశారు. దాంతో అప్పుడు కొంతమంది సుప్రీంకోర్టును వేర్వేరుగా ఆశ్రయించారు. అనంతరం ఆపద్ధర్మ కమిటీలోనూ విభేదాలు రావడం, నాటి కార్యదర్శి సరిగ్గా సమావేశాలకు రాకపోవడం తదితరాలతో అధ్యక్షులు సుబ్బారెడ్డి నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆంధ్రా క్లబ్‌కు ఎన్నికలకు నిర్వహించాలని కోరుతూ సంస్థ సభ్యులు, 'తెలుగు యువశక్తి' వ్యవస్థాపక అధ్యక్షులు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి గత ఏప్రిల్‌లో సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. ఈ వ్యవహారంపై గతంలో దాఖలైన సుమారు 8 పిటిషన్లపై విచారణ చేపట్టి తగిన నిర్ణయం వెలువరించాలని ఆ పిటిషన్లో అభ్యర్థించారు. ఈ పిటిషన్లన్నీ విచారణ దశలోనే వున్నాయి. అయితే జనవరిలో సభ్యుల నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిళ్ల నడుమ సుబ్బారెడ్డి నేతృత్వంలో సమావేశమైన అసాధారణ సర్వసభ్య సమావేశం ఆస్కాకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో ఇప్పుడు ఎన్నిక అనివార్యమైంది. అయితే ఈ ఎన్నికను రద్దు చేయాలంటూ ఇప్పటికే కొంతమంది మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ ఎన్నిక వ్యవహారంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ట్రెండ్‌సెట్టర్స్ ప్యానల్

అధ్యక్షుడిగా ఎం.ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పూరా లక్ష్మీ నరసింహారావు, కార్యదర్శిగా బి.శివనారాయణ, సంయుక్త కార్యదర్శిగా ఆర్‌వీఆర్ మూర్తి, కోశాధికారిగా జి.కేశవర్ధన రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా ఎం.పురుషోత్తం, కమిటీ సభ్యులుగా జి.నరేంద్ర, పీవీ శ్రీనివాసరావు, గోపాలకృష్ణా రెడ్డి, కె.రంగారెడ్డి, వై.శ్రీనివాసన్, సూరా శివప్రసాద్, కె.శ్రీధర్ రెడ్డి, సీహెచ్ కేఎస్ ప్రసాద్, ప్రవీణ్‌కుమార్.వి, ట్రస్టీలుగా కేఆర్‌కే బాలాజీరావు, వై.ఆనంద్, బీవీ సుబ్బారావు, బాలకృష్ణ, ఎం.రాజేంద్రరాజు, కె.శ్రీనాధ్, కేకే చౌదరి, ఆదినారాయణరెడ్డి, డి.అనిల్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నారు.

ఆస్కా శ్రేయస్సు కోసం 'ట్రెండ్‌సెట్టర్స్'ను గెలిపించండి

● మాజీ అధ్యక్షుడు నరసారెడ్డి

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): 'ఆస్కా'ను కాపాడుకునేందుకు యువకులు, విద్యావేత్తలతో కూడిన 'ట్రెండ్ సెట్టర్స్'ను గెలిపించాలని మాజీ అధ్యక్షుడు నరసారెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు జి.వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆస్కాకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో శనివారం ట్రెండ్ సెట్టర్స్ ప్యానల్‌ను సభ్యులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నరసారెడ్డి మాట్లాడుతూ... "ఎనిమిదేళ్లుగా సంస్థకు ఎన్నిక జరగలేదు. 2011 వరకు నేను అధ్యక్షునిగా పని చేశాను. ఆ తరువాత 2013, 2015లో ఎన్నికలు జరిగాయి. 2017లో మళ్లీ ఎన్నికలు ప్రకటించగానే నేను వ్యక్తిగతంగా సుప్రీంకోర్టుకు వెళ్లి, మా వాదనలు వినిపించి స్టే తొలగింపజేశాం. సుప్రీంకోర్టు సూచనల మేరకు ఓ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. కానీ చిల్డ్రన్స్‌కోటావారు పోటీ చేశారన్న కారణంగా కౌంటింగ్ నిలిపేశారు. దాంతో మేం మళ్లీ సుప్రీంకోర్టుకు వెళ్లాం. ఎన్నిక నిర్వహించాలని న్యాయస్థానానికి చెప్పాల్సిన క్లబ్ నిర్వాహకులు ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. అప్పుడే నేను నిర్ణయించుకున్నాను. ఇక భవిష్యత్తులో క్లబ్ ఎన్నికల్లో పోటీ చేయకూడదని. నేను పోటీ చేస్తే కొంతమంది న్యాయస్థానానికి వెళ్లి ఆటంకపరుస్తున్నారు. అలాంటప్పుడు నేను ఎన్నికలకు దూరంగా ఉంటే ఎవరో ఒకరు పదవి చేపట్టి క్లబ్ నిర్వహణ చూస్తారు. అందుకే క్లబ్ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నాను" అని వివరించారు.

ప్రతాప్‌రెడ్డి టీంను గెలిపించండి

"2011లో మేం క్లబ్ బాధ్యతలు అప్పగించినప్పుడు రూ.22 కోట్ల డిపాజిట్, నెలకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆదాయం చూపించాం. మా తరువాత కాలంలో 300లకు పైగా కొత్త సభ్యులు చేరారు. ఆ డబ్బంతా ఏమైంది? నేటి క్లబ్ దుస్థితికి బాధ్యులెవరు? కొంతమంది వ్యవహార శైలితో క్లబ్ ఎన్నికల వ్యవహారంలో జోక్యం చేసుకోకూడదనుకున్నాను. కానీ అడ్డదారులతో ఈ క్లబ్‌పై పెత్తనం సాగించాలనుకుంటున్న వారికి అడ్డుకట్ట వేయాలని చాలామంది సభ్యుల సూచనతో ఆఖరి నిమిషంలో ప్రయత్నాలు చేపట్టాం. గత ఆదివారం కూర్చొని నిస్వార్థపరులైన విద్యావేత్తలను, సంస్థ పట్ల అచంచలమైన ప్రేమ వున్న వారిని, కృషీవలురని వెతికి 'ట్రెండ్ సెట్టర్స్' ప్యానల్ ఏర్పాటు చేశాం. గత కమిటీల్లో స్వల్పంగా పని చేసిన వారిని, కొత్త వారిని కలిపి టీంగా ఏర్పాటు చేశాం. మన క్లబ్‌ను కాపాడుకునేందుకు ఈ టీంను ఏర్పాటు చేసి, ఎన్నికలకు సిద్ధమయ్యాం. క్లబ్‌ను ఒకనాటి ఆస్కాగా తీర్చిదిద్దుతాం. కొత్త టీం సమష్టిగా, అంకితభావంతో పని చేసి సంస్థను అభివృద్ధి చేస్తుంది. ఈ టీం విజయం కోసం సభ్యులంతా ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మా టీం అంతా పోటీ చేసేందుకు ముందుకొచ్చాం. రేపు ఎన్నిక అనగా, కోర్టు నుంచి స్టే తీసుకొచ్చారు. మళ్లీ 2019లో ఎన్నిక ప్రకటించగానే మా టీం యధాతథంగా ముందుకొచ్చింది. అప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. ఎన్నిక నిర్వహించి, బాధ్యతలు అప్పగించాల్సిన విధి నాటి కమిటీది. కానీ స్టే తీసుకొచ్చిన వారిని ఏమీ అనకుండా మిన్నకుండిపోయారు. నిజానికి ఎన్నికలు నిర్వహించేందుకు నాటి క్లబ్ కమిటీ ముందుకొచ్చి న్యాయస్థానంలో పోరాడాలి. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా జరిగింది. దాంతో మా సహచర సభ్యులందరి సూచనల మేరకు క్లబ్ భవిష్యత్తు కోసం సభ్యులంతా ట్రెండ్ సెట్టర్స్ ప్యానల్‌ను గెలిపించండి" అని నరసారెడ్డి విజ్ఞప్తి చేశారు.



నరసారెడ్డి, జి.వేణుగోపాల్‌తో 'ట్రెండ్‌సెట్టర్స్' ప్యానల్ సభ్యులు

నేత్రపర్వంగా వరదరాజ పెరుమాళ్ రథోత్సవం

● భక్తులతో కిక్కిరిసిన కాంచీపురం

- వివరాలు 7లో -



రెండోరోజూ కొనసాగిన ఈడీ తనిఖీలు

● టాస్మాక్‌లో అవినీతి కేసు...



టాస్మాక్ ఎండీ విశాఖన్‌ను తమ కార్యాలయానికి తీసుకెళ్తున్న ఈడీ అధికారులు

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్‌లో రూ.వెయ్యి కోట్ల మేర అక్రమ నగదు బట్వాడా జరిగిందన్న ఆరోపణలపై జరుపుతున్న విచారణలో భాగంగా ఈడీ అధికారులు రెండో రోజూ తనిఖీలు కొనసాగించారు. శుక్రవారం ఉదయం నుండి రాత్రి ఏడు గంటల వరకూ టాస్మాక్ మేనేజింగ్ డైరెక్టర్ సీనియర్ ఐఏఎస్ అధికారి విశాఖన్ నివాసం, సినీ నిర్మాత ఆకాష్‌భాస్కరన్ నివాసం సహా పదిచోట్ల ఈడీ అధికారులు సోదాలు జరిపిన విషయం విదితమే. శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో టాస్మాక్ ఎండీ విశాఖన్‌ను నుంగంబాక్కంలోని తమ కార్యాలయానికి తీసుకెళ్ళి ఈడీ అధికారులు ఐదు గంటలపాటు విచారణ జరిపారు. ఆ తర్వాత రాత్రి 12 గంటల ప్రాంతంలో ఆయన తన నివాసానికి వచ్చారు.. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం మళ్ళీ విశాఖన్ నివాసంలో సోదాలు కొనసాగించారు. ఇదే విధంగా తేనాంపేటలో ఉన్న సినీ నిర్మాత ఆకాష్ భాస్కరన్ నివాసం, విద్యుత్‌బోర్డు పౌరసంబంధాల శాఖ మాజీ అధికారి మేఘనాథన్ నివాసం, కార్యాలయం, చూళైమేడులోని మరొక నివాసం, అన్నానగర్‌లో ఉన్న రియల్ ఎస్టేట్ కార్యాలయం, బిసెంట్ నగర్‌లోని విద్యుత్‌బోర్డు కాంట్రాక్టర్ రాజేష్‌కుమార్ నివాసంలో ఈడీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేశారు. విశాఖన్ నివాస గృహంలో శనివారం సాయంత్రం వరకూ ముమ్మర తనిఖీలు జరిపిన ఈడీ అధికారులు మళ్ళీ ఆయనను నుంగంబాక్కంలోని తమ కార్యాలయానికి తీసుకెళ్ళి విచారణ ప్రారంభించారు.

తనిఖీల పేరిట వేధిస్తున్న ఈడీ...

ఇదిలా ఉండగా అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో విజిలెన్స్ విభాగం నమోదు చేసిన పాత కేసు ఆధారంగా ఈడీ అధికారులు తనిఖీల పేరుతో టాస్మాక్ సంస్థ ఉన్నతోద్యోగులను వేధిస్తోందని ఎక్సైజ్ శాఖ మంత్రి ముత్తుసామి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు జరుగుతున్న ఈడీ తనిఖీలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ ఓ ప్రకటన చేశారు. ఈ దాడులు రాజకీయ దురుద్దేశంతోనే జరుగుతున్నాయని, సుప్రీం కోర్టు నిబంధనలను ఉల్లంఘిస్తూ ఈడీ అధికారులు సోదాల పేరుతో టాస్మాక్ ఉద్యోగులందరినీ మానసికంగా వేధించడం గర్హనీయమన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో విజిలెన్స్ శాఖ నమోదు చేసిన పాత కేసులను తిరగదోడేలా ఈడీ అధికారులు ఈ దాడులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. టాస్మాక్ సంస్థలో అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అక్రమనగదు బట్వాడాను ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ హాయంలో జరిగినట్టుగా చిత్రీకరించడానికి ఈడీ అధికారులు అక్రమ పద్ధతులలో ప్రయత్నిస్తున్నారని మంత్రి ముత్తుసామి ఆరోపించారు. టాస్మాక్ సంస్థలో రూ.1000కోట్ల మేర అక్రమలావాదేవీలు జరిగినట్లు ఆరోపిస్తూ ఓ అసత్యపు నివేదికను తొందరపాటుగా వెల్లడించిన ఈడీ అధికారులు తాము చెప్పిన అబద్ధాలను నిజం చేసే ప్రయత్నమే ఈ వేధింపులని ఆయన ధ్వజమెత్తారు. ఈడీ అధికారులు చేస్తున్న దాడులను, టాస్మాక్ సంస్థపై చేస్తున్న ఆరోపణలను చట్ట ప్రకారం ఎదుర్కొనేందుకు డీఎంకే ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

టూరిస్ట్ వ్యాన్‌ను ఢీకొన్న ఆమ్నీ బస్సు

● బాలిక సహా నలుగురి మృతి

టి.నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): కరూరు సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న లగ్జరీ బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న టూరిస్టు వ్యాన్‌ను ఢీకొనటంతో ఎనిమిదేళ్ల బాలిక సహా నలుగురు మృతిచెందారు. కరూరు సమీపలోని మదురై జాతీయ రహదారిలో కోదూరు జంక్షన్ వద్ద శనివారం వేకువజాము 5.30 గంటలకు బెంగళూరు నుండి నాగర్‌కోవిల్‌కు 50 మంది ప్రయాణికులతో వెళుతున్న ప్రైవేటు బస్సు ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పక్కనే మరోమార్గంలో ఎదురుగా వస్తున్న టూరిస్టు వ్యాన్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో టూరిస్టు వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఆ వ్యాన్ డ్రైవర్ శశికుమార్ (52), బాలిక దక్షిక (8), సహా నలుగురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న కరూరు వెంగమేడు పోలీసులు, కరూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వ్యాన్ శిథిలాల నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కరూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన శరవణన్ (47), సుగుణాదేవి (36), నవీన్ (25), అను (20), ఆకాష్ (23), తష్మిత (6), కార్తీక్ ఐంకరన్ (8), తరుణ్‌వినాయక్ (6), మురుగన్ (55), రిత్తికా (3), మీనా (51), అనిల్ ప్రసాద్ (30), తరుణికా (12), ఆరతి (23)లను చికిత్స నిమిత్తం కరూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టూరిస్టు వ్యాన్

నాలుగు బిల్లులకు గవర్నర్ ఆమోదం

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన నాలుగు ముసాయిదా బిల్లులకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలిపారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 19వ తేది వరకు జరిగిన శాసనసభ సమావేశాల్లో 18 బిల్లులు మూజువాణి ఓటు ద్వారా నెరవేర్చి గవర్నర్ ఆమోదానికి పంపించారు. కొంతకాలంగా వేచి ఉన్న సమయంలో, శనివారం నాలుగు బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించారు. మరో 14 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

సమాచార ధ్వని

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, మే 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ) ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతుల కారణంగా ఆ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. మరమ్మతులు పూర్తయ్యాక యధాతథంగా విద్యుత్ సరఫరా ఉంటుందని టీఎన్ఈబీ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. ఆ మేరకు పట్టాభిరామ్ ప్రాంతంలోని సేక్కాడు, అయ్యప్పన్‌నగర్, శ్రీదేవినగర్, తండురై, కన్నపాళయం, గోపాలపురం, వీజీఎన్‌నగర్‌లో విద్యుత్ ఉండదని విద్యుత్ బోర్డు ప్రకటించింది.

రేపటి నుంచి ఫార్మాసిస్ట్‌ల శిక్షణ కోర్సు

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు ఆధ్వర్యంలో ఫార్మాసిస్ట్ పోస్టుల శిక్షణా కోర్సు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానుంది. గిండిలోని ఒకేషనల్ ఎంప్లాయ్‌మెంట్, కెరీర్ గైడెన్స్ సెంటర్‌లో శిక్షణా తరగతులు జరుగనున్నాయి. శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తుతో పాటు తగిన సర్టిఫికెట్ల నకళ్లతో గిండిలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు cgpecge@gmail.com అనే ఈ-మెయిల్ సంప్రదించవచ్చు.

'కల్పనా చావ్లా' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ధైర్యసాహసాలు ప్రదర్శించే మహిళలకు అందించే 'కల్పనా చావ్లా' పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... పురస్కార గ్రహీతలకు రూ.5 లక్షల నగదు, బంగారు పూత పూసిన వెండి పతకం, ప్రశంసాపత్రం అందజేస్తుంటారు. 2025 సంవత్సరానికి కల్పనా చావ్లా పురస్కారానికి విపత్తుల నుంచి ప్రజలను కాపాడడం సహా ధైర్యసాహసాలు ప్రదర్శించిన మహిళలు https://award-s.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో జూన్ 16వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

ప్రభుత్వ శిల్ప కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలోని ప్రభుత్వ కళాశాలలో నాలుగేళ్ల కళల కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు జూన్ 30లోగా దరఖాస్తుటసమర్పించాలి. నాలుగేళ్ల అధ్యయన కోర్సు, సాంప్రదాయ ఆర్కిటెక్చర్ బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ), సాంప్రదాయ శిల్పం, పెయింటింగ్, డ్రాయింగ్ బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ తదితర కోర్సుల్లో చేరేందుకు ప్లస్ టూ ఉత్తీర్ణులై ఉండాలి. జనవర్ విభాగం విద్యార్థులు 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ విభాగం విద్యార్థులు 26 ఏళ్లలోపుండాలి. దరఖాస్తు రుసుముగా ఎస్సీ, ఎస్టీలు రూ.50, ఇతరులు రూ.100 చెల్లించాలి. దరఖాస్తుతో పాటు తగిన సర్టిఫికెట్లను www.artandculture.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో జూన్ 30వ తేదిలోపు సమర్పించాలి. వివరాలకు 044-27442261 అనే నెంబరు సంప్రదించవచ్చు.

ఐదు ప్రాంతాల్లో తాగునీటి ఏటీఎంలు

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని తండయార్‌పేట మండలంలో ఐదు ప్రాంతాల్లో తాగునీటి ఏటీఎంలు ఏర్పాటుకానున్నాయి. ముత్తమిళ్‌నగర్ బస్టాండ్, కొడుంగైయూర్ వాసుకి నగర్ పార్క్, వైద్యనాథన్ ఫ్లై ఓవర్, ఎన్నూర్ హైరోడ్డు, టోల్ గేట్ బస్టాండ్ తదితర ఐదు ప్రాంతాల్లో ఈ ఏటీఎంలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కేంద్రాలు తలా రూ.10 లక్షలతో ఏర్పాటుకాగా, తాగునీరందించే యంత్రాలు త్వరలో ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

14కి డీపీఐ ర్యాలీ వాయిదా

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలో ఈ నెల 31వ తేది నిర్వహించాల్సిన డీపీఐ ర్యాలీ జూన్ 14వ తేదీకి వాయిదాపడింది. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్ విడుదల చేసిన ప్రకటనలో... 'లౌకికత్వాన్ని కాపాడుకుందాం' అనే పేరిట నిర్వహించనున్న ర్యాలీ ఈ నెల 31కి బదులు జూన్ 14వ తేది నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైద్యులకు ఆర్జిత సెలవులపై నిషేధం

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్యుల కొరత కారణంగా ఆర్జిత సెలవు (ఈఎల్) తీసుకోవడంపై నిషేధం విధించారు. ఈ మేరకు వైద్య ఉద్యోగుల సంక్షేమ సేవల డైరెక్టర్ జె.రాజమూర్తి విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యుల కొరత ఉందన్నారు. పలువురు వైద్యులు తమ వ్యక్తిగత పనుల కోసం ఈఎల్ తీసుకోవడంతో, ఆసుపత్రులకు వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కారణంగా వైద్యుల ఆర్జిత సెలవు తీసుకోవడంపై నిషేధం విధిస్తున్నట్లు, ఈఎల్ కోరుతూ చేసుకునే వినతిపత్రాలను జిల్లా అధికారులు నిరాకరించాలని ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ప్రవేశాలు

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 37,553 పాఠశాలలుండగా, సుమారు 52 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో, 2025-26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్లు మార్చి 1వ తేది నుంచి ప్రారంభించారు. ఆ ప్రకారం, ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటివరకు 1.8 లక్షల మంది చేరారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 3 లక్షల మందిని చేర్చాలని లక్ష్యం నిర్ణయించారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ఇంకా 15 రోజులు ఉండడంతో, అడ్మిషన్లు పెరిగిలా చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న 5 ఏళ్లకు పైబడిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

జూన్ 22న మురుగన్ భక్తుల మహానాడు

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): మదురైలో జూన్ 22న మురుగన్ భక్తుల మహానాడు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఈ మహానాడు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు రానున్నారని తెలిపారు. మహానాడు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. అలాగే, జిల్లా ఇన్‌ఛార్జిలను కూడా నియమించామని తెలిపారు. ఆ ప్రకారం, కన్నియాకుమారి, తూత్తుకుడి ఇన్‌ఛార్జిగా పొన్.రాధాకృష్ణన్, శివగంగ, మదురై, దిండుగల్ ఇన్‌ఛార్జీగా హెచ్. రాజా తదితరులను నియమించినట్లు నయినార్ నాగేంద్రన్ తెలపారు.

అన్నాడీఎంకే నేతలపై విజిలెన్స్ పంజా

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి అక్రమంగా రూ.200 కోట్లకు పైగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై తిరువణ్ణామలైలోని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సేవూరు రామచంద్రన్ నివాసంలో శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఇదే విధంగా మదురైలో ఉన్న ఉసిలంపట్టి మాజీ ఎమ్మెల్యే నీదిపతి నివాసంలో విజిలెన్స్ అధికారులు సోదాలు జరిపారు. సేవూరు రామచంద్రన్ 2016 నుండి 2021 వరకు హిందూ దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో ఆయన సంపాదనకు మించి సుమారు 200 కోట్లకు పైగా అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. రెండేళ్ల క్రితమే చెన్నైలోని అవినీతి నిరోధక విభాగం కేసులు కూడా నమోదు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సేవూరు రామచంద్రన్ అక్రమార్జనలపై ఫిర్యాదులు రావటంతో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు అరుళ్ ప్రకాష్ (తిరువణ్ణామలై), మైథిలి (వేలూరు) నేతృత్వంలో సుమారు 20 మంది శనివారం ఉదయం సోదాలు జరిపేందుకు వెళ్లారు. రామచంద్రన్ బంగళాతో పాటు. అదే ప్రాంతంలో ఉన్న రామచంద్రన్ కుమారులు సంతోష్‌కుమార్, విజయకుమార్ నివాసాల్లోనూ అధికారులు సోదాలు జరిపారు.


మాజీ ఎమ్మెల్యే నీదిపతి

ఉసిలంపట్టిలో...: ఇదే విధంగా మదురై జిల్లా ఉసిలంపట్టిలో అన్నాడీఎంకే నేత, మాజీ ఎమ్మెల్యే పి. నీదిపతి నివాసగృహంలోనూ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. మదురై జిల్లా ఉసిలంపట్టి సమీపంలోని కన్నాయ్‌పట్టికి చెందిన పి. నీదిపతి 2016 నుండి 2021 వరకు ఉసిలంపట్టి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈయన కూడా తన సంపాదనకు మించి అక్రమంగా ఆర్జించినట్లు ఫిర్యాదులందాయి. దానిపై కేసు నమోదు చేసుకుని విజిలెన్స్ అధికారులు ఉసిలంపట్టి పేరయూరు రోడ్డులో ఉన్న పి. నీదిపతి నివాసంలో సోదాలు జరిపారు.


మాజీ మంత్రి సేవూరు రామచంద్రన్, ఆయన నివాసం

29న అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈ నెల 29 నుండి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో ఈ నెల 29, 30 తేదీల్లో పార్టీ పురోభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి, వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహరచన గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శులు, జిల్లాల ఇన్‌ఛార్జులు తప్పకుండా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

నగరంలో అప్రకటిత విద్యుత్‌కోత

ప్యారీస్, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం రాత్రి ఏర్పడిన అప్రకటిత విద్యుత్‌కోత కారణంగా ప్రజలు ఉక్కపోత భరించలేక తల్లడిల్లిపోయారు. నగరంలో ఇటీవల కాలంగా ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తమిళనాడు విద్యుత్ బోర్డు నిలిపివేస్తోంది. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి 10 గంటల నుండి తెల్లవారుజాము వరకు వ్యాసర్పాడి, ఎంకేబీ నగర్, కృష్ణమూర్తి నగర్, సీతారామ్‌నగర్, నుంగంబాక్కం, ఎగ్మూర్, ట్రిప్లికేన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో కంటిమీద కునుకులేకుండా జనం జాగారం చేశారు. రాజధాని నగరంలో తరచూ విద్యుత్ కోత సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని, అలాగే, క్రిమి సంహారక మందులు చల్లి ప్రజలకు దోమల బెడదలేకుండా చర్యలు చేపట్టాలని నగరవాసులు జీసీసీని డిమాండ్ చేశారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి


కూలిన చెట్లు

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): పాపనాశం పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షానికి వేలాది అరటి చెట్లు నేలకూలాయి. తంజావూరు జిల్లా పాపనాశం తాలూకా గణపతి అగ్రహారం, పట్టుకుడి, మనలూరు ఇలుంబక్కై, మాగాళిపురం, దేవన్‌కుడి సహా చుట్టుపక్కల గ్రామాల రైతులు సుమారు వంద ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం హఠాత్తుగా ఈదురుగాలులతో కూడిన వర్షానికి అరటి చెట్లు నేలకొరిగాయి. మరో నెలరోజుల్లో కాయలు కోసే పనులు చేపట్టనున్నామని, ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలతో చేతికందాల్సిన పంట నేలపాలైందని, తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మా కష్టాలను తీర్చండి!

● రెవెన్యూ అధికారుల సమావేశంలో రైతుల వేడుకోలు


సమావేశంలో మాట్లాడుతున్న రైతు

తిరుత్తణి, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై శనివారం రైతులతో అవగాహన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు హాజరుకాగా, సమావేశాన్ని రెవెన్యూ కమిషనర్ కనిమొళి ప్రారంభించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు మాకు అందడంలేదని ఆర్కేపేటకు చెందిన ఓ రైతు అధికారులను నిలదీశాడు. అదే సమయంలో తిరుత్తణికి చెందిన రైతులు కూడా రెవెన్యూ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు.గత మూడేళ్ళుగా రైతులకు ఇచ్చే సబ్సిడీలను కూడా చెల్లించడంలేదని తెలిపారు. దీనిపై స్పందించిన రెవెన్యూ కమిషనర్ కనిమొళి రైతుల సమస్యలపై చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఈ సమావేశం ముగిసింది.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్యారీస్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో 900 కిలోల రేషన్ బియ్యాన్ని ఆర్పీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ కమిషనర్ రామకృష్ణన్ ఉత్తర్వుల మేరకు ఎగ్మూర్ రైల్వేస్టేషన్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సబాస్టియన్ నేతృత్వంలో శుక్రవారం ఆ రైల్వేస్టేషన్‌లోని ఓ ప్లాట్‌ఫామ్ చివరన కొన్ని రోజులుగా బియ్యం బస్తాలున్నట్లు గుర్తించారు. మొత్తం 45 బస్తాల్లో ఉన్న 900 కిలోల బియ్యాన్ని పరిశీలించి రేషన్ దుకాణాల్లో వినియోగించే బియ్యంగా నిర్ధారించారు. ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, పౌరసరఫరాల శాఖ అధికారులకు శనివారం అప్పగించారు. ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో సీసీ ఫుటేజీని పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

ఊటీలో కుండపోత

జలదిగ్బంధంలో ఆర్పీఎఫ్ స్టేషన్

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతంలో ఊటీలో ఉరుములు, మెరుపులతో కురిసిన కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించింది. లోట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గత వారం రోజులుగా జిల్లా అంతటా చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల దాకా భారీగా వర్షాలు కురవటంతో సెంట్రల్ బస్‌స్టేషన్, బొటానికల్ గార్డెన్, తలైకుందా, ఫింగర్‌పోస్ట్ తదితర ప్రాంతాల రహదారుల్లో వర్షపు నీరంతా వరదలా ప్రవహించింది. రైల్వేస్టేషన్‌లో వర్షపునీరు ఉధృతంగా ప్రవహించి, రైల్వే పోలీసుస్టేషన్ చుట్టూ అడుగు లోతున నీరు ప్రవహించడంతో పోలీసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం రాత్రి కూడా అక్కడక్కడా ఓ మోస్తరుగా వర్షాలు కురిశాయి. శనివారం ఉదయం వర్షాలు ఆగి ఊటీ అంతటా చల్లదనం చోటుచేసుకుంది. దీంతో బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లవర్‌షో తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు.


జలదిగ్బంధంలో ఉన్న ఊటీ రైల్వేపోలీసుస్టేషన్

సేలం వద్ద రోడ్డు ప్రమాదం

● ఇద్దరు ఐటీ ఉద్యోగుల మృతి

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): సేలం సమీపం తిరువాకవుండనూరు ఫ్లైఓవర్ వద్ద శనివారం వేకువజాము గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఐటీ ఉద్యోగులు దుర్మరణం చెందారు. సేలం ఉక్కుకర్మాగారం సమీపం దళవాయిపట్టికి చెందిన సారథి (22), దాదకాపట్టికి చెందిన చారుప్రియా (22) మామాంగం ప్రాంతంలోని ఓ ఐటీ సంస్థలో పనిచేస్తున్నారు. ఆ సంస్థలో పనిచేస్తున్న స్నేహితులతో కలిసి వీరిద్దరూ ఏర్కాడుకు విహారయాత్రగా బయలుదేరారు. సారథి, చారుప్రియా ఒక బైకులో, వీరి స్నేహితులు వేర్వేరు బైకుల్లో శనివారం వేకువజాము మూడు గంటలకు ఏర్కాడుకు పయనమయ్యారు. సారథి నడుపుతున్న బైకు తిరువాకవుండనూరు ఫ్లైఓవర్ వద్ద వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సారథి, చారుప్రియా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ముందుగా బైకుల్లో వెళుతున్న స్నేహితులు తమ వెనుక సారథి బైకు ఎంతసేపటికీ రాకపోవడంతో వెనక్కి తిరిగొచ్చి చూడగా నుజ్జునుజ్జయిన బైకు పక్కనే సారథి, చారుప్రియ విగతజీవులుగా పడి ఉండటం చూసి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈ సమాచారం అందుకుని పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. సూరమంగళం పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాద స్థలంలో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.


మృతులు సారథి, చారుప్రియా (ఫైల్‌ఫొటో)

బిహార్ బాలికకు తమిళంలో 93 మార్కులు

● ప్రశంసించిన సీఎం స్టాలిన్

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం కొల్‌బజార్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బిహార్‌కు చెందిన జియా కుమారి పదో తరగతి పరీక్షల్లో తమిళ పాఠ్యాంశంలో 93 మార్కులు సాధించింది. 467 మార్కులతో ఆమె ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. ఈ సందర్భంగా జియాకుమారి మీడియాతో మాట్లాడుతూ తమ పాఠశాలలో టీచర్లు బాగా కోచింగ్ ఇచ్చారని, 'నాన్ ముదల్వన్ పథకం' కూడా తనకు తోడుగా నిలిచిందని తెలిపింది. తన స్వస్థలం బిహార్ అని, 17 యేళ్ల క్రితం చదువుల కోసమే చెన్నై వచ్చానని పేర్కొంది. డాక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని జియాకుమారి వివరించింది. టీవీలో జియాకుమారి ఇంటర్వ్యూ చూసిన ముఖ్యమంత్రి స్టాలిన్ ను ఆమెను అభినందిస్తూ ఓ సందేశం పంపారు. తన ఎక్స్‌పేజీలో 'తమిళనాడు - భవిష్యత్ భారత దేశపు ఆశాకిరణం' అంటూ ప్రశంసించారు.


సీఎం స్టాలిన్, బీహార్ బాలిక జియా కుమారి

తండ్రీకొడుకుల మధ్య రాజీయత్నం

● పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి

ప్యారీస్, మే 17 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకులు రాందాస్ అతని తనయుడు ఎంపీ అన్బుమణి మధ్య ఉన్న విభేదాలను తొలగించి, రాజీ ప్రయత్నాలు చేపట్టినట్లు ఆ పార్టీ గౌరవ అధ్యక్షుడు జీకే మణి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల్లో ఒకటైన పీఎంకేను డాక్టర్ రాందాస్ ప్రారంభించారు. ప్రస్తుతం ఆ పార్టీ అధ్యక్షుడిగా ఆయన కుమారుడు అన్బుమణి వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఎవరూ ఊహించని విధంగా అన్బుమణిని పార్టీ అధ్యక్ష పదవి నుండి తొలగించినట్లు రాందాస్ ప్రకటించి, ఆ పదవిలో తానే కొనసాగుతానని తేల్చిచెప్పారు. దీంతో తండ్రికొడుకుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఇటీవల జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న తండ్రికొడుకులు పలకరించుకోకపోవడం పార్టీశ్రేణులను ఆందోళనకు గురిచేసింది. ఈ నేపథ్యంలో, శుక్రవారం పీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశాన్ని రాందాస్ ఏర్పాటు చేయగా, దీనికి అన్బుమణి గైర్హాజరయ్యారు.. ఆ సమావేశంలో 101 మంది జిల్లా కార్యదర్శుల్లో కేవలం 10 మంది మాత్రమే హాజరుకాగా, నిర్వాహకులు కూడా తక్కువ మంది పాల్గొన్నారు. ఇదిలా వుండగా శనివారం నగరంలో జీకే మణి మీడియాతో మాట్లాడారు. ఒక రాజకీయ పార్టీలో నేతల మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడటం సహజమేనని, పీఎంకేలో కూడా ప్రస్తుతం అదే సమస్య తలెత్తిందన్నారు. తండ్రికొడుకుల మధ్య అభిప్రాయ భేదాలను తొలగించేందుకు తాను ప్రయత్నాలు చేపట్టినట్లు జీకే మణి తెలిపారు. శుక్రవారం రాత్రి తాను తండ్రీకొడుకులతో ఫోన్‌లో మాట్లాడానని, త్వరలో ఎలాంటి సమస్య లేకుండా పార్టీలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

చెన్నై వాసుల దాహార్తి తీర్చేందుకు మరో రిజర్వాయర్

● పర్యావరణ శాఖ అనుమతిని కోరిన జల వనరుల శాఖ

వాషర్‌మెన్‌పేట, మే 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగర దాహార్తి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు ప్రారంభించింది. ఆ మేరకు 6వ రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించింది. కోవలంలో రూ.471 కోట్లతో దీనిని నిర్మించేందుకు జల వనరుల శాఖ పర్యావరణ శాఖ అనుమతి కోరింది.. చెన్నై నగరంలో జనాభా నానాటికీ పెరుగుతోంది. శివార్లలో ఐటి హబ్‌ల రావడంతో పొరుగు రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకనుగుణంగా తాగునీటి సరఫరా పెంచాల్సిన ఆవశ్యకత ప్రభుత్వానికి ఏర్పడింది. ప్రస్తుతం నగర ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రధానంగా 5 రిజర్వాయర్లు అందుబాటులో ఉన్నాయి. వాటి మొత్తం సామర్థ్యం 11.757 టీఎంసీలు. ఈ రిజర్వాయర్‌ల నుంచే కాకుండా వీరాణాం, మధురాంతకం చెరువుల నుండి కూడా నీటిని తీసుకువచ్చి నగరవాసులకు ప్రభుత్వం అందిస్తోంది. చెన్నైలో పెరుగుతున్న జనాభా గణాంకాల ప్రకారం 2035 నాటికి నగర తాగునీటి అవసరం 34 టీఎంసీలకు చేరుతుందని వారి అంచనా. మరోవైపు నగరంలో భూగర్భ జల మట్టం తగ్గుతుండడం అధికారులను ఆందోళనకు గురి చేస్తోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని, నగరంలో అదనంగా మరో రిజర్వాయర్ నిర్మించడానికి రూ.350 కోట్లను కేటాయించినట్లు గత బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం వెల్లడించింది. నగర శివారు ప్రాంతమైన కోవలం దీనికి అనువైనదిగా ప్రభుత్వం ఎంచుకుంది. ఓఎంఆర్ - ఈసీఆర్ మధ్యలో చెంగల్పట్టు జిల్లాలోని తిరుప్పోరూర్ తాలూకా పరిధిలోని 4375 ఎకరాల్లో ఇది నిర్మించనున్నారు.. ఈ నూతన రిజర్వాయర్ 1.6 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేయగలదు. దీని నిర్మాణానికి సంబంధించి పర్యావరణశాఖ అనుమతి కోరుతూ రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు వినతి పత్రాన్ని సమర్పించారు. భవిష్యత్తులో చెన్నై నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా, ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ 6వ రిజర్వాయర్ ఉపయుక్తంగా ఉండగలదని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అనుమానం పెనుభూతమై...

● భార్య సహా ఇద్దరిని హతమార్చిన భర్త

తిరుత్తణి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా షోళింగర్ సమీపంలోని పుదుగుడియానూర్ గ్రామానికి చెందిన బాలు (30) కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి కొనేళ్ళ క్రితం పుదుపేటలోని రాజేంద్రన్ కుమార్తె భువనేశ్వరితో వివాహమైంది. వీరికి 4ఏళ్ళ కుమారుడున్నాడు. ఈ క్రమంలో భువనేశ్వరి తన ఇంటి ఎదురుగావున్న విజయ్ (28)తో సన్నిహితంగా ఉండటాన్ని గమనించిన బాలు తరుచూ ఆమెతో గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో, గురువారం రాత్రి సమయంలో భువనేశ్వరి తల్లి అల్లుడిని మందలించడానికి అక్కడికి రాగా, ఆమెపై కత్తితో దాడి చేసి హతమార్చాడు. అడ్డువచ్చిన భార్యను, ఇంటి ఎదురుగావున్న విజయ్ తల్లిని నరికి చంపాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలును అరెస్టు చేశారు.

పాడి వంతెనపై ప్రమాదం

● తల్లీ కుమార్తె దుర్మరణం

పెరంబూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాడి ఫ్లై ఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ, కుమార్తె మృతిచెందగా, తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. శరవణన్-ప్రియ దంపతులు తమ కుమార్తె కరోలినా (1)తో శనివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై పాడి వంతెనపై వెళ్తున్న సమయంలో లారీ ఢీకొంది. ఈ ఘటనలో వాహనం నుంచి కిందపడిన ప్రియ తలపై లారీ చక్రం ఎక్కడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందింది. చుట్టుపక్కలవారు గాయపడిన శరవణన్, చిన్నారిని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక కరోలినా మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


టెన్త్‌లో కవలలకు సమాన మార్కులు



చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో ఐదుగురు కవల పిల్లలు సమానమైన మార్కులు సాధించడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. టెన్త్ శుక్రవారం విడుదలైన విషయం తెలిసిందే. ఈ పరీక్షల్లో 93.80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ క్రమంలో, పదవ తరగతి పరీక్షల్లో ఐదుగురు కవల పిల్లలు ఒకేరకంగా మార్కులు సాధించారు. పాఠ్యాంశాల వారీగా మార్కులు వేరుగా ఉన్న మొత్తం మార్కులు ఒకేలా ఉన్నాయి. మదురై తిరుప్పాలై ప్రాంతానికి చెందిన రమేష్ కుమరవేల్ కుమార్తెలు మాయాశ్రీ-మహాశ్రీ ఇద్దరూ 475 మార్కులు సాధించారు. మదురై జిల్లా కీళయూరు గ్రామానికి చెందిన వైరవన్ కుమారులు రామనాథన్-లక్ష్మణన్ 459 మార్కులు, కోవై రామనాదపురానికి చెందిన కవిత-కనిక 474 మార్కులు, తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టికి చెందిన న్యాయవాది గణేష్ కుమారులు హరిహరన్-సెంథిల్‌నాదన్ 457 మార్కులు, సేలం జిల్లా మేట్టుపట్టి గ్రామానికి చెందిన మణి-దీప 475 మార్కులు సాధించారు.

మృత్యువు కబళించినా విద్యార్థిగా విజయం సాధించాడు

వాషర్‌మెన్‌పేట, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆలయ వేడుకల్లో పాల్గొని విద్యుదాఘాతంతో మృతిచెందిన విద్యార్థి 313 మార్కులతో పదవ తరగతి ఉత్తీర్ణత కావడంతో తల్లిదండ్రులు ఆవేదనకు గురయ్యారు. మైలాడుదురై జిల్లా మేలయూర్ ఉత్తిరాపతియార్ ఆలయ వేడుకలు ఏప్రిల్ 25వ తేది జరిగాయి. వేడుకల్లో పదవ తరగతి పరీక్షలు రాసిన తమిళ్ దురై కూడా పాల్గొని విద్యుదాఘాతంతో మృతిచెందాడు. శుక్రవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తమిళ్ దురై 313 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. దీంతో, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విషాదంలో మునిగారు.


తమిళ్ దురై (ఫైల్‌ఫొటో)


డీఎంకే వ్యవసాయ విభాగం కన్వీనర్‌గా మాధవన్

తిరుత్తణి, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు నార్త్ డీఎంకే నూతన వ్యవసాయ కార్మిక విభాగం కన్వీనర్‌గా మాదవన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన సహచరులతో కలిసి శుక్రవారం ఉదయం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. కార్యక్రమంలో మండల యువజన విభాగం ఉపకార్యదర్శి చంద్రు, విద్యార్థి విభాగం ఉపకార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఎస్.చంద్రన్‌ను సత్కరిస్తున్న మాధవన్ తదితరులు

విద్యార్థుల ప్రతిభే వారిని ప్రయోజకులను చేస్తుంది

తిరుత్తణి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని ఆ పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో, శనివారం సాయంత్రం టెన్త్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఘన సత్కారించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభే వారిని ప్రయోజకులను చేస్తుందని, అలాంటి విద్యను నేర్పడంలో తమ పాఠశాల ముందుంటుందన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న పాఠశాల నిర్వాహకులు


'థగ్‌లైఫ్'లో కమల్, శింబు

'థగ్‌లైఫ్' ట్రైలర్ రిలీజ్

స్టార్ దర్శకుడు మణిరత్నం, విశ్వనటుడు కమల్ హాసన్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న 'థగ్‌లైఫ్' మూవీ ట్రైలర్‌ను శనివారం రిలీజ్ చేశారు. వీరిద్దరి కాంబినేషన్‌లో దాదాపు 35 యేళ్ళ తర్వాత వస్తున్న మూవీ కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొనివున్నాయి. ఈ నేపథ్యంలో మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేయగా, ఇది గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో సాగేలా తెరకెక్కించినట్టు తెలుస్తోంది. కమల్ హాసన్ గ్యాంగ్‌స్టర్ కాగా, అతడి వద్ద శింబు పెరిగి పెద్దవాడవుతాడు. కాలక్రమంలో కమల్ - శింబుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో కొంతకాలం పాటు కమల్ కనిపించకుండా పోతాడు. ఆ తర్వాత ఆయన తిరిగివచ్చాక ఏం జరిగింది? అనేదే ఈ సినిమా కథలా ఉంది. రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో కమల్, శింబుతో పాటు అభిరామి, త్రిష, సన్య మల్హోత్రా, ఐశ్వర్య లక్ష్మీ, జోజూ జార్జ్, గౌతమ్ కార్తీక్, నాజర్ తదితరులు నటించారు. ఏఆర్.రెహ్మాన్ సంగీతం. జూన్ 5వ తేదీ ఈ మూవీ విడుదల చేయనుండగా, చిత్రం ఆడియోను ఈ నెల 24న రిలీజ్ చేయనున్నారు.

రేసింగ్ కోసం బరువు తగ్గా: హీరో అజిత్

● నవంబరు నుంచి కొత్త చిత్రం



కార్ రేస్ పోటీల కోసం గణనీయంగా బరువు తగ్గినట్టు అగ్ర హీరో అజిత్ కుమార్ చెప్పారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, 'కారు పందెం పోటీల కోసం 2024 ఆగస్టు నుంచి ఇప్పటివరకు 42 కేజీల మేరకు బరువు తగ్గాను. ఇప్పటివరకు నేను కార్ రేస్, సినిమాలు ఇలా రెండు పడవలపై ప్రయాణం చేస్తున్నాను. ఈ కారణంగా వ్యక్తిగతంగా, ప్రొఫెషనల్‌గా అనేక ఎత్తుపల్లాలను చవిచూశాను. ఇకపై మంచి నిర్ణయం తీసుకోబోతున్నాను. రేస్ పోటీలు జరిగే సమయంలో సినిమాలకు, సినిమాల్లో నటించే సమయంలో కార్ రేస్ పోటీలకు దూరంగా ఉండాలని నిర్ణయించాను. నేను నటించే కొత్త చిత్రం నవంబరు నుంచి ప్రారంభంకానుంది. 2026 ఏప్రిల్ లేదా మే నెలలో విడుదల కావొచ్చని భావిస్తున్నాను' అని వెల్లడించారు.

లక్ష్యంతో ముందుకెళ్లండి : ఖుష్బూ



తన అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులకు సీనియర్ నటి ఖుష్బూ ఓ విజ్ఞప్తి చేశారు. మీకంటూ ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాజాగా ఆమె ఓ పోస్ట్ చేశారు. 'ఈ ప్రయాణం ఎంతో అందంగా, అద్భుతంగా ఉంది. కొన్ని సమయాల్లో కష్టాలు ఎదురైనప్పటికీ వాటిద్వారా అనేక విషయాలను నేర్చుకున్నాను. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఓర్పు, పట్టుదల, మనోధైర్యాన్ని కోల్పోవద్దు. ఒక లక్ష్యంతో ముందుకు సాగండి. ఖచ్చితంగా విజయం వెతుక్కుంటూ వస్తుంది. మీ ఉన్నతిని చూసి కొందరు జీర్ణించుకోలేరు. అయినప్పటికీ మీరు ఎంచుకున్న మార్గంలో మీరు ముందుకు సాగండి. నిరంతరం మీ కష్టాన్ని నమ్ముకోండి' అని ఖుష్బూ పేర్కొన్నారు.

తమిళ చిత్రాల్లో తగ్గిపోతున్న హాస్యం !!

చిత్రజ్యోతి

● ఆ స్థాయి దర్శకులు లేరా?

ఇటీవలికాలంలో తమిళ చిత్రపరిశ్రమలో హాస్యం పాళ్ళు గణనీయంగా తగ్గిపోతోంది. దీంతో హాస్యానికి ప్రాధాన్యతనిస్తూ, సినిమాలను తీసే దర్శకులు లేరా అనే సందేహం వస్తోంది. నిజానికి ఒక చిత్రం విజయంలో స్టోరీ, స్క్రీన్‌ప్లే, నటీనటులు, దర్శకులు ఇలా ఎందరో కీలక భూమిక పోషిస్తారు. అలాగే, ఆ చిత్రంలో పాటలు, హాస్యం అదేస్థాయిలో కీలకంగా ఉంటాయి. గతంలో అనేక చిత్రాలు కేవలం హాస్యంతోనే సూపర్ హిట్ అయిన సందర్భాలున్నాయి. అదేసమయంలో ఒక్కో కాలంలో ఒక్కో తరహా హాస్య నటులు అగ్రస్థానంలో నిలిచారు. వారితో పాటు చిన్న చిన్న కామెడీ నటులు కూడా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారు. కానీ, ఇటీవలి కాలంలో తమిళ చిత్రాల్లో ప్రేక్షకులను నవ్వించే హాస్యపు సన్నివేశాలు గగనమైపోయాయి. తమిళంలో స్టార్ కమెడియన్లుగా ఉన్న సంతానం, యోగిబాబు ఇపుడు హీరోలుగా మారిపోయారు. దెయ్యం, సెంటిమెంట్, థ్రిల్లర్ వంటి సినిమాల్లో వారు నటిస్తున్నప్పటికీ వాటిలో హాస్యం చెప్పుకోదగిన స్థాయిలో ఉండడం లేదు. ఇటీవలికాలంలో సోషల్ మీడియా వేదికగా ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్ వీడియోలు, రీల్స్ నవ్వులు తెప్పిస్తున్నాయి. ఇపుడు వచ్చే చిత్రాల్లో కామెడీ సన్నివేశాలు ఆ స్థాయిలో కూడా లేకపోవడంతో సగటు ప్రేక్షకుడు తీవ్ర నిరాశకులోనవుతున్నాడు. దీనికి కారణం... ట్రెండ్‌కు అనుగుణంగా హాస్యపు సన్నివేశాలు రూపొందించే దర్శకులు లేకపోవడమేననే విమర్శ లేకపోలేదు. హీరోలు కూడా కామెడీ సీన్స్‌కు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం కథను నమ్ముకోవడం కూడా మరో మైనస్‌గా చెప్పుకోవచ్చు. ఫలితంగా ప్రస్తుతం వస్తున్న చిత్రాల్లో కామెడీ సన్నివేశాలు మచ్చుకైనా కనిపించడం లేదు. ఒక వేళ ఎవరైనా సాహసం చేసి కామెడీ సీన్స్ పెడితే అవి ప్రేక్షకులను నవ్వించలేకపోతున్నాయి.


'గ్యాంగర్స్'లో వడివేలు - సుందర్

SUNDAY SPECIAL

మండు వేసవి.. ఆపై ఎండ వేడి

● జూలో జంతువుల కోసం జాగ్రత్తలు

● వండలూరు పార్కులో ప్రత్యేక ఏర్పాట్లు

వేసవి ఎండల నుంచి జంతువులు, పక్షులు, సరీసృపాలకు ఉపశమనం కలించేలా అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వండలూరులోని అరింజర్ అన్నా జులాజికల్ పార్క్ (ఏఏజడ్‌పీ)లో సుమారు 2,500లకు పైగా జంతువులు, పక్షులను సంరక్షిస్తున్నారు. వేసవి ఎండల నుంచి జంతువులు సేదతీరేలా షవర్ బాత్, ఆకులతో పాకలు, బోను చుట్టూ వేళ్లతో తయారుచేసిన తడికలు ఏర్పాటుచేసి వాటిపై నీళ్లు చల్లుతూ ఉపశమనం కలిగిస్తున్నారు. అలాగే, ఎండ వేడికి గురికాకుండా ప్రత్యేక ఆహారం అందజేస్తున్నారు.


- పెరంబూర్, ఆంధ్రజ్యోతి

602 హెక్టార్లలో...

అరింజర్ అన్నా జులాజికల్ పార్క్ (ఏఏజడ్‌పీ) ఆగ్నేయ ఆసియాలో అతి పెద్దదిగా పేరొందించింది. 1855లో 602 హెక్టార్లలో ఈ పార్క్ ప్రారంభించారు. పర్యవేక్షణలో 82 శాతం మార్కులు సాధించిన ఏఏజడ్‌పీ 'బెస్ట్ జూ'గా నిలిచింది. ఈ పార్క్‌లో పులులు, సింహాలు, చిరుతలు, జాగ్వార్, ఏనుగులు, జీబ్రా సహా 45 రకాల జాతులకు చెందిన 504 జంతువులున్నాయి. దేశ, విదేశాలకు చెందిన చిలుకలు, కోళ్ల సహా 94 రకాలకు చెందిన 1,473 పక్షులు, తాబేళ్లు, మొసళ్లు కలిపి 39 జాతులకు చెందిన 412 సరీసృపాలున్నాయి. ఈ పార్క్‌ను ప్రతిరోజు వందలాది మంది సందర్శిస్తుండగా, వారాంతపు రోజులు, పండుగల సమాయాల్లో చిన్నారులు, పెద్దలతో పార్క్ సందడిగా ఉంటుంది.






ఏనుగు షవర్ బాత్





ఎండ నుంచి ఉపశమనం...

ఈ ఏడాది మార్చి చివరి నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. నగరంలో అత్యధికంగా 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, పార్క్‌లో ఉన్న జంతువులు, పక్షులు, పాములను ఎండ వేడి నుంచి కాపాడేలా పార్క్ అధికారులు, అటవీ శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. ముఖ్యంగా, 14 అడుగుల పొడవున్న 'కింగ్ కోబ్రా' ఉన్న అద్దాల పెట్టెకు టన్ను సామర్థ్యం కలిగిన ఏసీ ఏర్పాటుచేశారు. ఇక ఏనుగులకు ఎత్తుగా పైపులు ఏర్పాటుచేసి షవర్ బాత్ సదుపాయం కల్పించారు. పులులు, చిరుతలు ఉన్న బోనుల చుట్టూ చెట్ల వేళ్లతో చేసిన తడికెలు ఏర్పాటుచేసి వాటిపై నీటిని చల్లుతూ చల్లటి వాతావరణం కల్పిస్తున్నారు. జింకలు, జీబ్రా, అడవి దున్నలు తదితరాలు ఉండే ప్రాంతాల్లో తాటి, కొబ్బరి ఆకులతో పాకలు వేసి వాటిపై నీరు చల్లుతున్నారు. రామచిలుకలు, రకరకాల పక్షులుండే బోనుల్లో ఉదయం, సాయంత్రం నీళ్ల చలుతున్నారు. ఇందుకోసం పార్క్‌లోని ఏడు ప్రాంతాల్లో ట్యాంకులు ఏర్పాటుచేసి, రోజుకు సుమారు 9వేల లీటర్ల నీటిని వినియోగిస్తున్నారు. అలాగే, ఎండ తీవ్రతను జంతువులు తట్టుకొనేలా రకరకాల పండ్లు, కొన్ని ప్రత్యేక జంతువులకు జ్యూస్ తదితరాలు అందిస్తున్నారు.


చెట్టుకింద సేదతీరుతున్న సింహం

పర్యాటకుల ఆనందం..

ఉదయం, సాయంత్రం వేళల్లో ఏనుగులు షవర్‌బాత్, పక్షులపై నీరు చల్లడం తదితరాలను పర్యాటకుల ఆనందంగా చూస్తున్నారు. ముఖ్యంగా, షవర్‌బాత్‌లో ఏనుగులు తొండం ఊపుతూ స్నానం చేసే దృశ్యాలను పిల్లలు కేరింతలు కొడుతున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఈ నెలాఖరులోనే వచ్చే అవకాశముండడంతో జూ వాతావరణం చల్లబడుతుందని అధికారులు తెలిపారు.


జింకలపై నీరు చల్లుతున్న ఉద్యోగి


ఉరుములకు పురివిప్పిన శ్వేత నెమలి


నీటిలో తేలియాడుతున్న కొంగలు


ఈము కోళ్లపై నీటి పిచికారీ


పాకలో సేదతీరుతున్న జీబ్రా

కుమరిలో పెరిగిన పర్యాటకుల రద్దీ


కన్నియాకుమారి త్రివేణి సంగమం వద్ద పర్యాటకులు

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులకు వారంతపు సెలవులు కూడా తోడవడంతో ప్రపంచ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో శనివారం వేకుజాము పర్యాటలకు సందడి పెరిగింది. సూర్యోదయ దృశ్యాన్ని చూసేందుకు వేల సంఖ్యలో పర్యాటకులు త్రివేణి సంగమ ప్రాంతం, భగవతి అమ్మవారి ఆలయానికి తూర్పు దిశగా ఉన్న ఈస్ట్‌కోస్ట్ సముద్రతీర ప్రాంతం వద్ద గుమికూడారు. ఆకాశం మబ్బులు లేకుండా నిర్మలంగా ఉండటంతో సూర్యోదయ దృశ్యం సుస్పష్టంగా కనిపించడంతో పర్యాటకులు పులకించిపోయారు. అదే విధంగా వివేకానంద స్మారకమండపాన్ని సందర్శించేందుకు బోట్ సవారీ కోసం పూంపుహార్ షిప్పింగ్ కార్పొరేషన్ రేవు వద్ద పర్యాటకులు బారులు తీరారు. వివేకానంద స్మారక మండపం నుండి తిరువళ్లువర్ విగ్రహం వరకు ఉన్న అద్దాల వంతెనపై కూడా పర్యాటకులు నిలిచి ప్రకృతి సౌందర్యాలను తిలకించారు. ఇదేవిధంగా కన్నియాకుమారి భగవతి అమ్మన్, టీటీడీ శ్రీవారి ఆలయం, కొట్టారం శ్రీరామాలయం, సుశీంద్రం తానుమాలయ స్వామి, వివేకానంద కేంద్రం ప్రాంగణంలోని భారతమాత, రామాయణ దర్శన చిత్రపటాల ప్రదర్శన ప్రాంతం, గాంధీ స్మారక మండపం, కామరాజర్ మణిమండపం, ప్రభుత్వ మ్యూజియం, లైట్‌హౌస్ తదితర ప్రాంతాల వద్ద కూడా పర్యాటకుల రద్దీ క్రమంగా పెరిగింది.


పాక్ ఉగ్రవాద చర్యలను ప్రపంచ దేశాలకు ఎలుగెత్తి చాటేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విదేశీ పర్యాటక కమిటీలో స్థానం సంపాదించుకుని, విదేశాలకు బయలుదేరుతూ చెన్నై క్యాంపు ఆఫీసులో తన సోదరుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న డీఎంకే ఎంపీ కనిమొళి

కంచి వరదరాజపెరుమాళ్ రథోత్సవం


రాజవీథిలో ఊరేగుతున్న రథం


శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజపెరుమాళ్

టి.నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నగరం కాంచీపురంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచి వరదరాజపెరుమాళ్ వైశాఖ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటైన వరదరాజ పెరుమాళ్ ఆలయం 24 ఎకరాల విస్తీర్ణంలో, తూర్పు, పడమర రెండు రాజగోపురాలతో ఆనంద సరసు తీర్థకొలను, పొత్రామరై కొలను ఇలా రెండు తీర్థకొలనులు, వేణాగోపాల, భూవరాహ, రంగనాథుడి సన్నిధి అంటూ ఎన్నో సన్నిధులు కలిగిన ఆలయంగా భాసిల్లుతోంది. ఈ ఆలయంలో ప్రతియేటా వైశాఖ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఆ మేరకు ఈ యేడాది వైశాఖ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వరదరాజపెరుమాళ్ వివిధ వాహన సేవల్లో పాల్గొని భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన రథోత్సవం శనివారం ఉదయం ప్రారంభమైంది. సర్వాలంకరణశోభితంగా వరదరాజపెరుమాళ్, శ్రీదేవీ, భూదేవి సమేతంగా రథంలో ఆశీనులయ్యారు. వేలాదిమంది భక్తులు రథానికిరువైపులా ఉన్న మోకుతాళ్లను పట్టుకుని లాగుతూ ఆలయ రాజ వీథుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు, పోలీసులు తగు సదుపాయాలు కల్పించారు.

లైఫ్ లైన్ హాస్పిటల్‌లో ఐదేళ్ల బాలికకు బేరియాట్రిక్ శస్త్రచికిత్స

చెన్నై, మే 17 (ఆంధ్రజ్యోతి): జన్యు లోపంతో బాధపడుతున్న బంగ్లాదేశ్‌కు చెందిన ఐదేళ్ల బాలికకు స్థానిక లైఫ్ లైన్ ఆస్పత్రిలో బరువు తగ్గించే 'బేరియాట్రిక్' శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయమై లైఫ్ లైన్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ అండ్ బేరియాట్రిక్ సర్జన్ డా.అనిరుథ్ రాజ్‌కుమార్, చీఫ్ సర్జన్, చైర్మెన్ డా.జేఎస్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ... బాల్యంలోనే తీవ్రమైన ఊబకాయానికి దారితీసే అరుదైన జన్యు సమస్యతో బాలిక బాధపడుతుండేదన్నారు. బాలిక తల్లిదండ్రులు తమ హాస్పిటల్‌ను సంప్రదించగా, వారి నుంచి పూర్తి వివరాలు సేకరించారమన్నారు. బాలికకు క్లిష్టమైన బేరియాట్రిక్ సర్జరీ చేయాలని నిర్ణయించామని, నైపుణ్యులైన వైద్య సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైందని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం బాలిక రెండు వారాల్లోనే 8 కిలోల బరువు తగ్గడంతో పాటు శ్వాస సులభంగా తీసుకోవడం, నడవడం ప్రారంభించిందని, మరో ఆరు నెలల్లో 10-15 కిలోల వరకు బరువు తగ్గుందని తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే బరువు తగ్గించే శస్త్రచికిత్స తొలిసారిగా తమ హాస్పిటల్‌లో విజయవంతంగా నిర్వహించడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు.


శస్త్రచికిత్స నిర్వహించిన బాలిక, తల్లిదండ్రులతో లైఫ్ లైన్ హాస్పిటల్ జీఎండీ డా.అనిరుథ్ రాజ్‌కుమార్, చైర్మెన్ డా.జేఎస్ రాజ్‌కుమార్, వైద్య బృందం

మేట్టూరు డ్యాంలో పెరిగిన ఇన్‌ఫ్లో


జలకళ సంతరించుకున్న మేట్టూరు డ్యామ్

టి.నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ప్రధాన జలాశయాల పరిధిలో, రాష్ట్రంలోని కావేరి పరీవాహక ప్రాంతాల్లోనూ గత వారం రోజులుగా భారీగా వర్షాలు కురుస్తుండటంతో మేట్టూరు డ్యామ్‌లో ఇన్‌ఫ్లో రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం ఆ డ్యామ్‌లో సెకనుకు 3479 ఘనపుటడుగుల చొప్పున నీరు వస్తోంది. డ్యామ్‌లో నీటిమట్టం 108.31 అడుగులకు చేరింది. ఆ డ్యామ్ నుండి ప్రస్తుతం తాగునీటి అవసరాల నిమిత్తం సెకనుకు వెయ్యి ఘనపుడుగుల చొప్పున జలాలను విడుదల చేస్తున్నారు. ఇదే రీతిలో డ్యామ్‌లో ఇన్‌ఫ్లో పెరిగితే ప్రభుత్వం ప్రకటించినట్లుగానే జూన్ 12న సాగు జలాలను విడుదల చేసే అవకాశముంది.

హొగెనేకల్‌లో... : ధర్మపురి జిల్లా హొగెనేకల్ జలపాతంలోనూ రోజురోజుకూ ఇన్‌ఫ్లో అధికమవుతోందని కేంద్ర నీటివనరుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆ జలపాతంలో సెకనకు 6వేల ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశిస్తున్నాయని తెలిపారు. శుక్రవారం ఆ జలపాతంలో సెకనకు 5 వేల ఘనపుటడుగులచొప్పున జలాలు ప్రవేశించాయి. ప్రస్తుతం కర్ణాటకలోని కృష్ణరాజసాగర్ తదితర జలాశయాలన్నీ నిండిపోవడంతో అదనపు జలాలు విడుదల చేస్తున్నారు. అంతేకాకుండా ఆ జలాశయాల సమీప ప్రాంతాల్లోనూ భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో హొగెనేకల్ జలపాతంలో ఇన్‌ఫ్లో విపరీతంగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రధాన జలపాతం, ఐందరువి, సినీ ఫాల్స్, ఐవర్‌పాణి తదితర ప్రాంతాలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన పర్యాటకులు లైఫ్‌జాకెట్లు ధరించి దోనెలో జలపాతం అందాలను వీక్షించడానికి శనివారం వేకువజాము నుంచే బారులు తీరారు.

సీనియర్ నేతకు సీఎం అభినందన


ఇటీవల 100వ జన్మదిన వేడుకలు జరుపుకున్న డీఎంకే సీనియర్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే సోమా రామచంద్రన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

స్కేటింగ్‌పై ఆసక్తి. సాధన చేద్దామంటే ట్రాక్ లేదు. అయితేనేం పట్టుదలతో కసరత్తు చేసింది. రోడ్డే ట్రాక్‌గా చేసుకుంది. గాయాల పాలైనా వెనుకంజ వేయలేదు. ఇటీవల జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన కస్పరాజు స్నేహకృతి క్రీడా నేపథ్యమిది.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి





తిరుమలలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, నటి హరితేజ, సీఎం చంద్రబాబు సోదరి హైమావతమ్మ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. ఇక వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.2.56 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,970

తలనీలాలు సమర్పించినవారు: 33,871





సాధించిన పతకాలతో స్నేహకృతి

కాళ్లకు చక్రాలు కట్టుకుని...!

● జాతీయ స్థాయి స్కేటింగ్‌లో బంగారు పతక విజేత స్నేహ కృతి

ఇంటిల్లిపాదీ క్రీడలు ఆడే కుటుంబం నుంచి వచ్చింది కస్పరాజు స్నేహ కృతి. ఇటీవల ఢిల్లీలో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో 500 మీటర్ల పోటీల్లో బంగారు పతకంతో మెరిసింది. తిరుపతి రూరల్ పేరూరు సమీపాన నివాసం. తల్లి ప్రొఫెసర్ అఖిల స్వతంత్ర ఎస్వీ యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి. తండ్రి వంశీకృష్ణ న్యాయవాది. అక్క ఆశ్రిత తిరుపతి శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్‌కు వెళ్లేవారు. అక్కతో పాటు స్నేహకృతి కూడా వెళుతూ స్కేటింగ్ పట్ల మక్కువ పెంచుకుంది. తల్లికి షటిల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్‌లో ప్రావీణ్యముంది. తండ్రి వంశీకృష్ణ కబడ్డీలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. స్కేటింగ్ ట్రాక్ లేకున్నా రోజూ ప్రకాశం పార్క్‌కు వెళ్లి రెండు పూటలా ప్రాక్టీస్ చేసేది. ఒక్కోసారి ఐదు గంటల వరకూ ప్రాక్టీస్ చేసిన సందర్భాలున్నాయి. జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి బాబ్జీ, కోచ్‌లు ప్రసాద్, శశి కిరణ్, పవన్ కల్యాణ్ వద్ద మెలకువలు నేర్చుకుంది. పదేళ్ల నిరంతర కఠోర సాధన ఫలితమే తాజాగా జాతీయ స్థాయిలో స్వర్ణ పతకమంటోంది స్నేహకృతి. కాకినాడ స్కేటింగ్ పోటీల్లో 500 మీటర్లు, వెయ్యి మీటర్ల పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. 2019లో జాతీయ స్థాయిలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను పొందింది. స్నేహకృతి తిరుపతిలోని నారాయణ విద్యా సంస్థల్లో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఇంటర్‌లో 470కి గాను 456 మార్కులు సాధించింది. పదవ తరగతిలో 600కు 587 మార్కులు పొందింది.



తల్లిదండ్రులతో స్నేహకృతి

ట్రాక్ ఏర్పాటు చేయాలి

తిరుపతిలో కనీసం 200 మీటర్లతో స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ఎందరో రాణిస్తారు. నేను రోడ్లపైనే ప్రాక్టీస్ చేస్తూ అనేక సార్లు గాయపడ్డాను. అనుకూల వాతావరణం కల్పిస్తే ఎక్కువ మంది ఎదుగుతారు. 2019లో జాతీయ స్థాయిలో రాణించిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం రూ.10 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతి ప్రకటించినా అందలేదు. జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్‌కు రూ.75 వేలు, రజిత పతకానికి రూ.50 వేలు ప్రకటించి ఇవ్వలేదు. ఇలాంటివి అందిస్తే ప్రోత్సాహకరంగా ఉంటుంది.

- స్నేహ కృతి

శ్రుతిమించిన ఇసుకాసురుల ఆగడాలు

● పొర్లుకట్టను సైతం తొలిచేసిన వైనం

● ఆ మట్టితోనే నది గర్భంలోకి రోడ్డు ఏర్పాటు

పెళ్లకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా కప్పగుంటకండ్రిగ వద్ద పొర్లుకట్టను సైతం తవ్వేశారు. ఆ మట్టితోనే ఇసుక తరలింపు కోసం నది గర్భంలోకి ప్రత్యేక రోడ్డును నిర్మించారు. రోజూ రాత్రి ట్రాక్టర్లతో మేనకూరులోని ప్రైవేట్ కంపెనీలకు యథేచ్ఛగా ఇసుకను తరలించేస్తున్నారు. వాహనాల రాకపోకలతో స్వర్ణముఖి నది చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు పూర్తిగా ధ్వంసమైపోతున్నాయి.

● ఆందోళనలో రైతాంగం

స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను తవ్వేస్తుండడంతో సాగు, తాగునీటికి కష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందలాది వాహనాలతో ఇసుకను తరలించేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక మాఫియాను కట్టడి చేయాలి

జీలపాటూరు రెవెన్యూ పరిధిలోని స్వర్ణముఖినది సమీపంలో కప్పగుంటకండ్రిగ కాజ్‌వే నుంచి గత వైసీపీ హయాంలో భారీ యంత్రాలతో విచ్చలవిడిగా ఇసుక తోడేశారు. అప్పట్లో హైకోర్టులో పిటిషన్ వేసి ఇసుక తరలింపును అడ్డుకున్నాం. భూగర్భ జలాలను పెంచుతూ అదే ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మించాలని 2014 టీడీపీ ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు పంపాం. ఈ ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మిస్తే అనేక గ్రామాల ప్రజలకు తాగు, సాగు నీరు అందుతుంది. కూటమి ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉంది. అయితే ఇసుక మాఫియా అరాచకాలతో స్వర్ణముఖికి గర్భశోకం తప్పేలాలేదు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- శివకుమార్, సర్పంచు, జీలపాటూరు



కప్పగుంటకండ్రిగ సమీపంలో పొర్లుకట్టను తొలిచిన అక్రమార్కులు - (ఇన్‌సెట్‌లో) నదిలో ఏర్పాటు చేసిన రోడ్డు

కవి గొల్లాపిన్ని కన్నుమూత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17 (ఆంధ్రజ్యోతి): కవి గొల్లాపిన్ని సుబ్రమణ్యశర్మ (79) కన్నుమూశారు.చిత్తూరు జిల్లా సదుం ఈయన స్వగ్రామం.తిరుపతిలోని కొర్లగుంటలో నివాసముంటోన్న ఈయన శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. ఆర్టీసీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి 2010లో రిటైరయ్యారు. కవితాసుమాలు, పువ్వులు నవ్వులు, బాలలతాత, పక్షులం, విజయానికి ముప్పై రహస్యాలు, కల్హాపూర్ మహాలక్ష్మి చరిత్ర వంటి పుస్తకాలు వెలువరించారు. తిరుపతిలో జరిగే కవి సమ్మేళనాల్లో స్వీయ కవితలను లయాత్మకంగా చదివేవారు. గొల్లాపిన్నికి భార్య ఉషాకిరణ్, కుమార్తె సౌజన్య (అమెరికా), తనయుడు కిషోర్‌కుమార్ (బెంగళూరు) లో ఉన్నారు.సుబ్రమణ్యశర్మ అంత్యక్రియలు సోమవారం ఉదయం 10 గంటలకు ఆయన అత్తగారి ఊరైన అన్నమయ్య జిల్లా పీలేరు సమీపంలోని దొడ్డిపల్లె పంచాయతీ శివరామపురంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కవి గొల్లాపిన్ని మృతి పట్ల తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, సాహిత్యవేత్తలు ఆముదాల మురళి, శైలకుమార్, కృష్ణవేణి, యువశ్రీ మురళి, నాదెండ్ల శ్రీమన్నారాయణ, పేరూరు బాలసుబ్రమణ్యం, సింగార బాలమురళీకృష్ణ సంతాపం తెలిపారు. గొల్లాపిన్ని మృతి జిల్లా సాహిత్య రంగానికి తీరని లోటని వారు పేర్కొన్నారు.



సుబ్రమణ్యశర్మ (ఫైల్ ఫొటో)

ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ప్రణాళికలు: ఈవో

తిరుమల, మే17(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి ట్రస్టు ద్వారా ఇప్పటికే సమరసత సేవా ఫౌండేషన్, దేవదాయ శాఖ సహకారంతో నిర్మిస్తున్న ఆలయాల తీరుతెన్నులపై నివేదిక తయారు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శనివారం అధికారులతో ఈ ఆలయాలపై సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్టు నిబంధనలను పునఃసమీక్షించుకుని మరింత మెరుగ్గా, సులభతరంగా, పారదర్శకంగా ఉండేలా తయారు చేయాలన్నారు. సనాతన ధర్మాన్ని మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు ఆలయాల నిర్మాణాలు పునాదుల్లాంటివన్నారు. ఆలయాల నిర్మాణాలతో దైవచింతన, ఆధ్యాత్మిక, సేవాభావం సమభావంతో మానవ సంబంధాలు పెరుగుతాయన్నారు. నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల నిర్వహణకు పక్కాగా ప్రణాళికలు, వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా యంత్రాంగాన్ని రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీఈ టీవీ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



వీడిన యువకుడి మర్డర్ మిస్టరీ

శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి హత్య మిస్టరీ వీడింది. ముక్కంటి ఆలయ సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి గుడి మార్గంలో ఉన్న శ్మశానంలో ఐదు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతి ఈనెల 16న 'ఏం జరుగుతోంది' అన్న శీర్షికతో కథనం ప్రచురించింది. స్పందించిన ఎస్పీ హర్షవర్ధనరాజు కేసును త్వరితగతిన ఛేదించాలని శ్రీకాళహస్తి పోలీసు అధికారులను ఆదేశించారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి సిబ్బందితో కలిసి ముక్కంటి ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. మృతుడిది పాండిచ్చేరిగా గుర్తించారు. శ్రీకాళహస్తి పట్టణం దర్గామిట్టకు చెందిన కొందరు యువకులు అతన్ని హతమార్చినట్లు ఆధారాలతో సహా నిర్ధారించారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు, అధికారులు

తిరుపతి(ఆటోనగర్) మే17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి ప్రహల్లాద జోషి తెలియజేశారు. తిరుమల పర్యటన నిమిత్తం కేంద్రమంత్రి శనివారం ఉదయం తిరుపతి రైల్వే స్టేషన్‌కు హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లో చేరుకున్నారు. స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, బీజేపీ, జనసేన నాయకులు పుష్పగుచ్ఛాలతో ఆయనకు స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వాగతం పలికిన వారిలో బీజేపీ నాయకులు సామంచి శ్రీనివాసులు, గుండాల గోపినాథ్‌రెడ్డి, టి.సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖరరెడ్డి, రెడ్డిబాబు, ఎం.రవిప్రసాద్, డాక్టర్ నరేష్, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, ఆర్కాట్ క్రిష్ణప్రసాద్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో దేవెగౌడ



తిరుమల, మే 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం రాత్రి మాజీ ప్రధాని దేవెగౌడ, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి నైవేద్య విరామ సమయంలో వేర్వేరుగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. స్టేట్ లెవల్ కాన్సులేటివ్ కమిటీ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు చెరుకూరి వెంకటేశ్వరప్రసాద్ కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలో శ్రీకృష్ణ అతిథిగృహంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఏపీ అభివృద్ధికి సహకారం అందించాలని ప్రహ్లాద్‌జోషిని కోరారు. కాగా తొలుత కేంద్రమంత్రి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకన్నారు. ఆయనతోపాటు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ కూడా ఉన్నారు.

కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక వసంతోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారిని వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం 6 నుంచి 7 గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం సాయంత్రం స్వర్ణరథోత్సవం జరగనుంది. వసంతోత్సవాలు సందర్భంగా ఆలయంలో ఆర్జిత, కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

అతిథిగృహాల ఆచూకీకి అగచాట్లు



పాండవ గెస్ట్‌హౌస్ అని ముద్రించిన రసీదు

● రసీదుల్లో కొనసాగుతున్న పాతపేర్లు

తిరుమల, మే17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అతిథిగృహాల ఆచూకీ గుర్తించేందుకు భక్తులు అగచాట్లు పడుతున్నారు. ఇటీవల అతిథిగృహాలపై పేర్లు మార్చినా గదుల కేటాయింపు రసీదుల్లో పాతపేర్లనే ప్రింట్ చేసి ఇస్తుండటంతో తికమక పడుతున్నారు. అతిథిగృహాలకు దాతల సొంత పేర్లు కాకుండా పవిత్ర ఆధ్యాత్మిక పేర్లు మాత్రమే ఉండాలని ఇటీవల ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈ క్రమంలో 45 అతిథిగృహాలకు పేర్లు మార్చాల్సిన అవసరముందని అధికారులు గుర్తించారు. ఇప్పటికే కొన్నింటి పేర్లను మార్చారు. కొత్త బోర్డులను ఏర్పాటు చేశారు. సిఫార్సు లేఖలను పద్మావతి విచారణ కార్యాలయంలో పరిశీలించి గదులను కేటాయిస్తారు. అయితే గదుల వివరాలతో ఇచ్చే రసీదులో పాతపేర్లే ఉంటున్నాయి. తీరా అక్కడకు వెళితే కొత్త పేరుతో ఉన్న బోర్డులను చూసి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో తిరిగి పద్మావతీ విచారణ కార్యాలయానికి రావడం లేదా సమీపంలో ఉండే వ్యక్తులను గెస్ట్‌హౌస్ వివరాలను చెప్పి అడగడం వంటివి చేస్తున్నారు. గెస్ట్‌హౌస్‌లపై పేర్లు మార్చిన అధికారులు రసీదుల్లో మార్చేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



పాండవ గెస్ట్‌హౌస్‌పై 'విరజా నిలయం' బోర్డు

శేషాచలంలో అనధికార ట్రెక్కింగ్ నేరం

● ఫారెస్టు రేంజర్ వెంకటరమణ



భాకరాపేట, మే 17(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో అనుమతి లేకుండా ట్రెక్కింగ్ చేయడం చట్టరీత్యా నేరమని ఫారెస్టు రేంజర్ వెంకటరమణ స్పష్టం చేశారు. శనివారం భాకరాపేట ఫారెస్టు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భాకరాపేట రేంజ్ అటవీ ప్రాంతంలో వెంకటేశ్వర అభయారణ్యం, వెంకటేశ్వర జాతీయ ఉద్యానవనం చేర్చారన్నారు. వన మూలికలకు, పక్షి, వృక్ష జాతులకు, ప్రకృతి సహజ సౌందర్యానికి ఈ ప్రాంతం కేంద్రంగా ఉందన్నారు. ఇక్కడి విశేషాలను సోషల్ మీడియాలో పెడుతూ ప్రకృతి ప్రేమికులను మోసం చేస్తూ కొందరు నగదు వసూలు చేస్తున్నారన్నారు. ఇది చట్టవిరుద్ధమన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలోకి ఎవరికీ అనుమతి లేదన్నారు. ట్రెక్కింగ్ చేయడం శిక్షార్హమన్నారు. ఇప్పటికే తొమ్మిది ట్రెక్కింగ్ సంస్థలను గుర్తించి డీఎఫ్‌వో ఆధ్వర్యంలో విచారిస్తున్నారన్నారు. అనధికారికంగా ట్రెక్కింగ్ చేసి ఫొటోలు, వీడియోలు పెట్టిన మహేశ్ బాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశాన్నారు.

నేడు జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీల్లో బీటెక్, బీఎస్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికిగాను జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకుగాను మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్, తిరుపతి-రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. 8.30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తిరుపతి కో-ఆర్డినేటర్ దుర్గ వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలలోపలే పరీక్ష హాల్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలను అనమతించేది లేదని తెలిపారు.

● పరీక్ష అనంతరం షెడ్యూల్ ఇలా.. : అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలను ఈ నెల 22న వెబ్‌సైట్‌లో ఉంచుతారు. 26న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. జూన్ 2వ తేదీ ఉదయం 10 గంటలకు తుది కీ, ఫలితాలు విడుదల చేస్తారు. 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతంది.

నేడు సైన్స్ సెంటర్‌లో ఉచిత ప్రవేశం

మంగళం, మే 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి సైన్స్ సెంటర్‌లో ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. 3డీ షో, డిజిటల్ ప్లానిటోరియం షో, పార్కింగ్‌కు ఫీజు యథావిధిగా ఉంటుందని వివరించారు. మ్యూజియం, విజ్ఞానాన్ని పెంపొందించే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

1100కు కాల్ చేసి అర్జీ స్థితి తెలుసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందజేసిన అర్జీ స్థితి తెలుసుకోవడానికి అర్జీదారులు 1100టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే అదే నంబర్‌కు ఫోన్‌చేసి అప్లికేషన్ లేదా ఆధార్ లేదా మొబైల్ నంబర్లతో అర్జీ స్థితిని తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 933 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సప్లిమెంటరీ పరీక్షలకు 933 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 11,196 మంది దరఖాస్తు చేసుకోగా 10,356 మంది పరీక్షలు రాశారు. 840 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,473 మంది దరఖాస్తు చేసుకోగా 1,380 మంది పరీక్షలు రాశారు. 93 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ ఘటనలు చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

తుడా కార్యదర్శి బాధ్యతల స్వీకరణ



తిరుపతి, మే17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) కార్యదర్శిగా డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్ బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను తుడా సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, ఎమ్మెల్యేలు, నూతన ఛైర్మన్, వీసీల సమన్వయంతో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన చెప్పారు.